# ఆకాశమంత...

-కె.వి.సుమలత

"ఆంటీ! కర్చీఫ్ ఇదుగోండి.." హ్యాండ్ బ్యాగ్‌లో నుండి ప్రిస్కిప్షన్, డబ్బులు తీస్తున్న వాణి ఆ మాటలు వినిపించినవైపుకు చూసింది.

వైట్ స్లీవ్‌లెస్ ఫ్రాక్‌లో బొద్దుగా ముద్దుగా ఉన్న ఐదారు సంవత్స రాల మధ్య వయస్సున్న పాప కనిపించింది. బ్యాగ్‌లో నుండి ప్రిస్కి ప్షన్ తీసేటప్పుడు కర్చీఫ్ పడిపోయినట్లుంది. అది తీసి ఆ పాప చేతిలో పట్టుకుని వాణికి ఇచ్చింది.

"థాంక్స్‌రా స్వీటీ" అంటూ బుగ్గ గిల్లింది వాణి.

ప్రిస్కిప్షన్ మందుల షాపు ఓనరు చేతికిచ్చి అప్పటికే మందులు తీసు కుని డబ్బులు లెక్క చూసుకుంటున్న పెద్దాయనను చూసింది వాణి.

తెలుపు చొక్కా, పంచెకట్టుతో ఉన్న ఆయన్ని ఎక్కడో చూసినట్లనిపిం చింది. కొన్ని క్షణాలలోనే గుర్తుకొచ్చి ముఖం ఆనందంతో వెలిగిపోయింది.

"మీరు రామనాథం మాస్టారుగారు కదూ" వాణి గొంతులో ఎంతో ఉద్వేగం.

"అవునమ్మా... నేనే. నీవెవరో నేను గుర్తు పట్ట లేదమ్మా" అన్నారాయన.

"నేను వాణిని మాస్టారూ... మీతోపాటు పని చేసిన కృష్ణమూర్తిగారి అమ్మాయిని."

"నువ్వా అమ్మా... ఎప్పుడో చిన్నపిల్లప్పుడు చూసాను. నాన్నగారు కొవ్వూరు ట్రాన్స్‌ఫర్ మీద వెళ్లాక కలువలేకపోయాను. మొదట్లో ఉత్తర ప్రత్యుత్తరాల ద్వారా క్షేమ సమాచారాలు తెలుసుకునే వాళ్లం. తరువాత తరువాత అదీ తగ్గి పోయింది. ఆ మధ్యన నాన్నగారు కాలం చేస్తా రని తెలిసి చాలా బాధపడ్డాను. ఆలస్యంగా తెలి యడంతో రాలేకపోయాను. నీవు మీ బంధువుల ఇంట్లో వుంటున్నట్లు తెలిసింది. చిన్నప్పుడే తల్లిని, ఇప్పుడు తండ్రిని పోగొట్టుకున్నావమ్మా. దేవుడు నిన్ను చిన్నచూపు చూసాడు తల్లీ" బాధపడుతూ అన్నారాయన.

తండ్రి గుర్తుకువచ్చి వాణి కళ్లు చెమర్చాయి. కళ్లు తుడుచుకుని తనను తాను తమాయించు కుంది.

"ఒక్క నిముషం మాస్టారు" అంటూ మందులు తీసుకుని "ఇక్కడకు దగ్గరే మా ఇల్లు వెళ్దాం పదండి" అంది ఆయనతో.

"ఇప్పుడు కాదులేమ్మా.. మరోసారి వస్తాము"

"ఎంతో దూరంలేదు. బాగా ఎండగా ఉంది. మజ్జిగ త్రాగి వెళ్దురుగాని రండి మాస్టారు"

వాణి గొంతులో అభ్యర్థనను ఆయన కాదన లేక ఆమెను అనుసరించారు.

"హాయ్ స్వీటీ...నీ పేరేంటి?" అంది వాణి ఆ పాప చేయి పట్టుకుంటూ.

"మీరే అన్నారుగా స్వీటీ అని" గడుసుగా అంది పాప.

"స్వీటీనేనమ్మా దాని ముద్దు పేరు" అన్నారు మాస్టారుగారు.

"ఈ పాప ఎవరు మాస్టారు? అడగడం మర చిపోయాను. ఆంటీ ఎలా ఉన్నారు? లహరి ఎలా ఉంది? పెళ్లయిపోయిందా?" వాణి ప్రశ్న లకు ఆయన జవాబు ఇచ్చేలోగానే ఇల్లు వచ్చే సింది.

తాళం తీసి వాళ్లను లోపలకు తీసుకువెళ్లి కూర్చోబెట్టింది.

ఫ్రిజ్‌లో నుంచి మజ్జిగ గ్లాసులో పోసి మాస్టా రుగారికి ఇచ్చింది.

స్వీటీని లోపలకు తీసుకువెళ్లి బిస్కెట్స్, పాలు ఇచ్చింది.

వాళ్లు కాస్త సేద తీరాక "ఇప్పుడు చెప్పండి మాస్టారు నా ప్రశ్నలకు జవాబులు" అనడిగింది వాణి.

"ఈ పాప లహరి కూతురు స్వీటీ. పాప సంవ త్సరం పిల్లప్పుడే ఆక్సిడెంట్‌లో లహరి చనిపో యింది. అల్లుడు ఇక్కడే కాల్ సెంటర్‌లో ఉద్యోగం చేస్తుంటాడు. పసిదాని సంరక్షణ కోసం అల్లుడి కోరిక మీద నేను మీ ఇంటి ఇక్క డకు వచ్చేసాము. ఒక్కగానొక్క కూతురు మాకు దూరమైనా గుండె దిటవు చేసుకుని ఈ పసిదాని లోనే వాళ్ల అమ్మను చూసుకుని బ్రతుకు తున్నాం. కానీ ఆ అదృష్టం కూడా మాకు కరువ వుతుందేమోనని ప్రతిక్షణం భయపడిపో తున్నాం తల్లీ" ఆయన గొంతులో బాధ.

"తాతయ్యా... ఈ ఆంటీ నీకు తెలుసా?" అంది స్వీటీ వాణివైపు వేలుపెట్టి చూపిస్తూ.

"నీ అంత ఉన్నప్పుడు నా దగ్గరే చదువుకు నేది. నిన్ను ఎత్తుకున్నట్లే ఎత్తుకునేవాడ్ని" అన్నారు నవ్వుతూ.

"ఈ ఆంటీనా?" అనుమానంగా అడిగింది స్వీటీ.

"అప్పుడు అంత పెద్దగా లేను స్వీటీ. నీలాగే చిన్నగా ఉండేదాన్ని" వాణి వివరంగా చెప్పింది.

టీవీలో కార్టూన్స్ చూస్తూ నిమగ్నమైన మన వరాలిని చూపిస్తూ "దీని వయస్సు చిన్నదిగానీ వచ్చిన జబ్బు మాత్రం చాలా పెద్దది. మూత్ర పిండాల వ్యాధితో బాధపడుతోంది. ఒక కిడ్నీ పూర్తిగా పాడయిపోయింది. రెండవదానికి ఇప్పు డిప్పుడే ఇన్‌ఫెక్షన్ సోకుతోందని డాక్టర్లు చెప్పారు. ఖరీదైన వైద్యం చేయిస్తున్నాం. సాధ్య మైనంత త్వరలో కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయా లన్నారు. లేకపోతే పాప ప్రాణానికే ముప్పు అని చెప్పారు. ఎవరైనా కిడ్నీ డొనేట్ చేస్తే పాపకు ఆపరేషన్ చేయించడానికి సిద్ధంగా ఉన్నాము" అన్నారు మాస్టారు.

వాణి విషయం విన్నాక చిత్తరువులా మ్రాన్ప

డిపోయింది.

"ముక్కుపచ్చలారని ఈ పసిదానికి ఇంత ప్రమాదకరమైన వ్యాధా?'' మనసులో అనుకో బోయి పైకే అనేసింది.

"ఇక మేము బయలుదేరుతామమ్మా. మీ ఆంటీ ఇంకా రాలేదని ఎదురుచూస్తూ ఉంటుంది'' మాస్టారుగారు లేచి నిలబడ్డారు.

"వీలు చూసుకుని నేనే మీకు కనిపిస్తాను మాస్టారుగారు. లహరికి అప్పుడే నూరేళ్లు నిండా యన్న వార్త తట్టుకోవడమే కష్టంగా ఉందంటే స్వీటీ విషయం మరింత బాధగా ఉంది. దేవుడు స్వీటీని చల్లగా చూడాలని ప్రార్థిద్దాం. ఆంటీని అడిగానని చెప్పండి. బై స్వీటీ...'' అంటూ స్వీటీ తల నిమిరింది వాణి.

వాళ్లు వెళ్లాక కూడా వాణి మాస్టారుగారు చెప్పిన విషయాలనుండి తేరుకోలేకపోయింది.

వాణి చిన్నతనంలో మాస్టారుగారి ఇంటికి దగ్గరలోనే ఉండేవారు. తల్లిలేని వాణిని మాస్టారు గారి కుటుంబం ప్రేమగా ఆదరించింది. వాణితో లహరి స్నేహంగా ఉండేది. అంతెందుకు... వారి కుటుంబంలో వాణి ఒక వ్యక్తిలా కలిసిపోయేది.

వాణి వాళ్ల నాన్నగారికి కొవ్వూరు ట్రాన్స్‌ఫర్ కావడంతో అక్కడినుండి వచ్చేసారు. చాలా కాలం వాళ్లకు దూరంగా ఉండాల్సి రావడంతో దిగులు పడింది వాణి. గుండెపోటుతో తండ్రి చనిపోవడంతో వాణి ఒంటరిదయింది.

అదృష్టవశాత్తు చదువు పూర్తి కాగానే కాల్ సెంటర్‌లో ఉద్యోగం వచ్చింది. సహజంగానే మితభాషి ఆవడంతో తన పని తను చూసుకు నేది. సహోద్యోగి అయిన శ్రీకాంత్ మంచి మాట కారి. ఎప్పుడూ నవ్వుతూ అందరినీ నవ్విస్తూ ఉండేవాడు. ఎవరికి ఏ సహాయం కావాల్సి వచ్చినా 'నేనున్నాను' అంటూ సహాయం చేస్తూ



ఉండేవాడు. పొదుపుగా మాట్లాడే వాణిని పిలిచి మరీ పలకరించేవాడు. అలా మొదలైన పరిచయం తొందరలోనే స్నేహంగా మారింది.

"మీరంటే నాకు చాలా ఇష్టం. జీవితాంతం నాకు తోడుగా ఉంటారా?" శ్రీకాంత్ మాటలకు క్షణకాలం నివ్వెరపోయింది వాణి.

"మా అమ్మా నాన్నలకు నేను, ఇద్దరు చెల్లెళ్లు. వాళ్లు మా ఊరిలో ఉంటున్నారు. నేను ఉద్యోగం కోసం ఇక్కడ ఉంటున్నాను. నాన్నగారు రిటైరయ్యారు. చెల్లెళ్ల బాధ్యత నామీద ఉంది. మీకు అభ్యంతరం లేకపోతే మీ పెద్దవాళ్లతో మాట్లాడతాను" అన్నాడు.

"నాకంటూ ఎవరూలేరు. ఆస్తిపాస్తులు కూడా పెద్దగా లేవు" మెల్లగా అంది వాణి.

"అంటే మీకు అంగీకారమేగా" సంతోషంగా అడిగాడు.


చిన్నగా నవ్వింది వాణి.

చిన్నతనంలోనే తల్లినీ, తరువాత తండ్రినీ దూరం చేసి తనను ఒంటరిని చేసిన దేవుడు శ్రీకాంత్‌లాంటి మంచి వ్యక్తికి భార్యగా చేయడం అదృష్టంగా భావించింది వాణి.



## స్పెషల్ అట్రాక్షన్

భూమిక చిత్రనిర్మాతగా తన తొలి ప్రయత్నంగా 'తకిట తకిట' అనే సినిమాని కొత్త వాళ్లతో నిర్మిస్తోంది. అయితే ఇందులో తనతోపాటు అనుష్క కూడా రెండు స్పెషల్ అపియరెన్స్‌లలో కనిపిస్తారట. అవును మరి, అందరూ కొత్త వాళ్లయితే కష్టమే కదా! ఇలా స్పెషల్ అట్రాక్షన్ వుంటే కొంతయినా జనాలను ఆకట్టుకోవచ్చునని భూమిక ఆలోచన. భూమికతో పాటు అనుష్క కూడా అంటే చిన్న వేషమైనా చాలు, కొంత ఆసక్తి వుంటుంది కదా!




★★★

ఒకరోజు శ్రీకాంత్‌కి అర్జంట్‌గా బయలుదేరి రమ్మని కబురు రావడంతో ప్రయాణమయ్యాడు. బయలుదేరేముందు తమ సంగతి ఇంట్లో మాట్లాడతామని చెప్పాడు. అలా వెళ్లిన శ్రీకాంత్ పదిరోజుల తరువాత వచ్చాడు. ఇదివరకటి ప్రశాంతత అతడి ముఖంలోలేదు. వాళ్ల ఇంటి దగ్గర ఏదో జరిగినట్లు వాణి పసిగట్టింది. లంచ్ టైమ్‌లో వాణి అడగకుండానే జరగినదంతా శ్రీకాంత్ ఆమెకు వివరించాడు.శ్రీకాంత్ చిన్న చెల్లెలు ఎవరినో ప్రేమించిందిట. ఈ విషయం తల్లిదండ్రులకు తెలిసి ఆమెను మందలించేసరికి ఆత్మహత్యా ప్రయత్నం చేసిందిట. శ్రీకాంత్ వెళ్లాక అబ్బాయి తరఫువాళ్లను, ఆ అబ్బాయి తల్లిదండ్రులను ఒప్పించి పెళ్లి సెటిల్ చేసాడట. చిన్నదానికి పెళ్లయితే పెద్ద చెల్లికి సంబంధాలు రావని, ఈలోగా ఆమెకు కూడా పెళ్లి చేయాలని నిర్ణయించుకున్నారుట. ఇద్దరి పెళ్లిళ్లకు అవసరమయ్యే డబ్బు ప్రస్తుతానికి వారివద్ద లేకపోవడంతో శ్రీకాంత్‌కి డబ్బున్న అమ్మాయితో పెళ్లి చేద్దామనుకున్నారని చెప్పాడు.

"ఇంతకీ నువ్వేమనుకుంటున్నావు?" అంతా విని నిశ్చేష్టురాలయిన వాణి అడిగింది.

"ప్రస్తుత పరిస్థితుల్లో అమ్మావాళ్లు చెప్పినదానికి తల వంచడమే న్యాయమనిపిస్తోంది. నీకున్న కొద్ది మొత్తం తీసుకున్నా సరిపోదు. అప్పులు చేయడం, కష్టాలు పడడం ఇదంతా నాకు సరిపడదు. నిన్ను చేసుకుని ఇబ్బందులపాలు కావడం తప్ప మరేమీ కనిపించడంలేదు. విడిపోవడం బాధే అయినా నన్ను స్వార్థపరుడిగా భావించినా అదే మంచిదనిపిస్తోంది నాకు వాణీ"

వాణికి అతడి మాటలు హృదయాన్ని చీలుస్తున్నట్లు అనిపించింది. ఇంక అక్కడే ఉండడం అవివేకమనిపించింది. లేచి తన టేబుల్ వద్దకు వెళ్లిపోయింది తడబడే అడుగులతో.

ప్రేమను వ్యాపార కోణంలో చూస్తున్న శ్రీకాంత్‌ని ఏ విధంగా అంచనా వేయాలో అర్థం కాలేదు వాణికి.

మరోసారి అతడిని ఒప్పించే ప్రయత్నం కూడా చేయలేదు. మానసికంగా ఆమెకు పెద్ద గాయమే అయింది. ఆ కాల్ సెంటర్‌లో ఉండడం కష్టమనిపించి అక్కడికి దూరంగా ఉండే మరో ఆఫీస్‌లో ఉద్యోం చూసుకుని వెళ్లిపోయింది.

వాణి కోలుకుని తిరిగి మామూలుగా మారడానికి చాలా కాలమే పట్టింది. కానీ శారీరకంగా అస్వస్థతకు గురయింది. ఆరోగ్యంలో తేడాను ఆమె గుర్తించేసరికి ఆమె అనారోగ్యం తీవ్రస్థాయికి చేరుకుంది. మూత్రపిండాలు పాడయిపోవడంతో వెంటనే కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయాలని డాక్టర్లు చెప్పారు. దెబ్బ మీద దెబ్బ పడుతున్నా విధికి ఎదురీది జీవన పోరాటం సాగిస్తున్న వాణి ప్రస్తుతం కిడ్నీ దాత కోసం ఎదురు చూస్తోంది.

తన అనారోగ్యం కన్నా కూడా స్వీటీ గురించి తెలిసినప్పుడు ఎక్కువగా బాధపడింది. కారణం స్వీటీ చిన్నపిల్ల. అందునా మాస్టారి కుటుంబంపట్ల కృతజ్ఞత భావమేమో!

★★★

కొద్దిరోజుల తరువాత డాక్టర్ గారి నుండి అర్జంటుగా కలవమని కబురు రావడంతో హాస్పిటల్‌కు వెళ్లింది వాణి. డాక్టర్‌గారి గదివైపు వెళ్తున్న వాణికి

లోపలి నుండి బయటకు వస్తున్న వ్యక్తి ఎత్తుకున్న పాప స్వీటీలా కనిపించింది. నీరసంగా ఉన్న స్వీటీని పిలువబోయిన వాణి ఒక్కసారిగా ఉలిక్కిపడింది. స్వీటీని ఎత్తుకున్న వ్యక్తిని శ్రీకాంత్‌గా గుర్తించింది. అంటే... స్వీటీ శ్రీకాంత్, లహరిల కూతురా? ముచ్చెటమలు పోసాయి. శ్రీకాంత్ ఆమెను చూడలేదు.

"డాక్టర్‌గారు మీకోసం ఎదురుచూస్తున్నారు" అన్న నర్సు మాటలకు తేరుకుని డాక్టర్‌గారి రూములోకి వెళ్లింది వాణి.

'మా అల్లుడు చాలా మంచివాడమ్మా. స్వీటీ అంటే అతనికి ప్రాణం' అన్న మాస్టారుగారి మాటలు వాణికి గుర్తుకొచ్చాయి.

అన్యమనస్కంగా కనిపిస్తున్న వాణిని పరీక్షగా చూస్తూ "మీరు ఆపరేషన్‌కు సిద్ధం కావచ్చు. మీకు కిడ్నీ డొనేట్ చేయడానికి డోనర్ సిద్ధంగా ఉన్నాడు. ఆలస్యం చేయకుండా ఉండడం చాలా మంచిది" అన్నాడు డాక్టర్.

"థాంక్స్ డాక్టర్. కానీ నాదొక రిక్వెస్ట్. ఇప్పుడు మీ రూమ్‌లో నుండి బయటకు వచ్చిన పాప కండిషన్ ఎలా ఉంది?"

"మీమీద బెటర్. ఆ పాపకు కూడా కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ అవసరం."

"ఆ పాపకు ఈ కిడ్నీ సెట్ అవుతుంది అనుకుంటే ముందుగా తనకే ఇవ్వండి డాక్టర్"

"వాడ్డూయూ మీన్. మీరు సీరియస్ కండిషన్‌లో ఉన్నారు."

"నేను చేసేది త్యాగం కాదు డాక్టర్. మానవతా దృక్పథం. ప్లీజ్ నన్నర్థం చేసుకోండి" అని అక్కడి నుండి వచ్చేసింది వాణి.

***

వాణి కోరిక ప్రకారం డాక్టర్‌గారు శ్రీకాంత్‌కి ఇన్‌ఫర్మేషన్ తెలియజేయడంతో స్వీటీకి కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ సకాలంలో జరిగింది. ఆపరేషన్ సక్సెస్ అయిందని డాక్టర్ చెప్పడంతో మాస్టారు దంపతులు "మీరు మా పాలిట దేవుడు' అంటూ కళ్లనీరు పెట్టుకున్నారు.

"నేను చేసింది ఏమీలేదు. తనకు అమర్చవలసిన కిడ్నీని వద్దని మీ పాపకు దానం చేసిన వ్యక్తి వేరే ఉన్నారు. ఆమే అసలైన ప్రాణదాత" అన్నాడు డాక్టర్.

"ఒక్కసారి ఆమెకు కృతజ్ఞతలు తెలుపుకుంటాము. అడ్రస్ ఉంటే ఇవ్వండి" అన్నాడు అక్కడే ఉన్న శ్రీకాంత్.

"రిసెప్షన్‌లో అడగండి" అని వెళ్లిపోయాడాయన.

***

కాలింగ్ బెల్ శబ్దానికి నిద్రలోవున్న వాణి వచ్చి తలుపు తీసింది. ఎదురుగా శ్రీకాంత్ నిలబడి ఉన్నాడు.

ఊహించని పరిణామానికి ఉలిక్కిపడినా పక్కకు తొలగి "రండి" అని లోపలకు ఆహ్వానించింది వాణి.

వాణిని చూసిన షాక్‌లో నుండి అతనింకా తేరుకోలేదు. అయోమయంగా చూస్తూ "వాణీ... నువ్వేనా? ఏమిటిక్కడ?" అన్నాడు.

"నేనే... ఇది మా ఇల్లే" అంది.

"స్వీటీకి కిడ్నీ డొనేట్ చేయమంది నువ్వేనా?

"అవును నేనే చెప్పాను" అంది వాణి.

"నీవు అదే వ్యాధితో బాధపడుతున్నావని చెప్పారు డాక్టర్‌గారు. నా కూతురని తెలిసే ఇదంతా చేసావా?" నమ్మలేనట్లుగా అడిగాడు శ్రీకాంత్.

ఉత్సాహానికి ప్రతిరూపంలా ఉండే అతని ముఖంలోనిరాశా నిస్పృహలను చూస్తూ "నీ కూతురు కాకపోయినా నేను అదే పని చేసేదాన్ని. నా పసితనంలో మాస్టారుగారి కుటుంబం నాపై చూపించిన ప్రేమ ఒక కారణం. స్వీటీకి ఎంతో భవిష్యత్తు ఉంది. అర్థాంతరంగా ఆ పసి మొగ్గ రాలకూడదని అనుకోవడమే ముఖ్యమైన కారణం. నాలోని ఆడ మనసు చలించిపోవడంతో ఇలా చేసాను. తను నీ కూతురు కావడం కేవలం యాదృచ్ఛికం మాత్రమే. ఎవరి మెప్పు కోసం నేనీ పని చేయలేదు. ఈ విషయాలు మాస్టారుగారికి, స్వీటీకి కూడా తెలియవలసిన అవసరంలేదు. నా తృప్తి కోసం నేను చేసిన పని కాబట్టి ఇక దీన్ని ఇంతటితో వదిలేస్తే మంచిది" అంటూ లేచి నిలబడింది 'ఇక నువ్వు వెళ్లవచ్చు' అన్న ధోరణిలో.

ఆకాశమంత ఎత్తుకు ఎదిగిన ఆమె ఔన్నత్యం ముందు లోలోపలే సిగ్గుతో కుంచించుకుపోతున్న తను అణువులా అనిపించి అక్కడి నుంచి మౌనంగా వెనుదిరిగాడు శ్రీకాంత్.

★

## రావణ సంతతి

ఇప్పటి మార్వార్‌ని ఒకప్పుడు మండోదరే అని పిలిచేవారట. ఆ దేశ రాజకుమార్తె మండోదరియే రావణుని భార్య. రావణుని వధ తర్వాత ఆయన వారుసులు మండోదరేకి వలస వచ్చేసారుట. వాళ్ళనే ఇప్పుడు మౌద్గల బ్రహ్మణులంటారు. 1459లో జోధ్‌పూర్ నిర్మాణం తర్వాత వారంతా అక్కడకి వలస వచ్చారుట. ఇప్పటికీ 150 మౌద్గల బ్రాహ్మణ కుటుంబాలక్కడున్నాయి.

## ప్రపంచంలో పెద్ద పుస్తకం

అమెరికాలోని చికాగోలోని లైబ్రరీలో 'భూటాన్-ఎ విజువల్ ఒడెస్సీ' అన్నది ప్రపంచంలో అది పెద్ద పుస్తకమట. దాని వెడల్పు 5 అడుగులు, పొడవు 7 అడుగులు. బరువు 60 కిలోలు!

## సబ్బుమీద పన్ను

ఇంగ్లాండులో 1862 వరకు స్నానానికి సబ్బుని వాడటం ఒక రాజుల అంతఃపురాల్లోని ఆడంబరం మాత్రమేననుకునేవారుట. బయట ఎవరైనా సబ్బుని వాడితే వాళ్ళు పన్ను కట్టాల్సి వచ్చేదిట.

-విమలారామం

